


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4PM

బంగారం ధర 10 GRMS 22 CARAT ₹63,870
వెండి ధర 1kg 80,000
సెన్సెక్స్ 72,272
నిఫ్టీ 21,742
చికెన్ ధర 1kg ₹210
గుడ్ల ధరలు డజన్ ₹70



ఎల్లుండి కాంగ్రెస్‌లోకి
## వైఎస్ షర్మిల

వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరికకు ముహూర్తం ఖరారయింది. ఈ నెల 4న పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఆమెతోపాటు మరో 40 మంది కూడా కాంగ్రెస్ కండువా కప్పుకో నున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం పార్టీ కార్యకవర్గ సమావేశం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో కొనసాగు తున్నది. షర్మిలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్ప గించాలని కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించినట్టు తెలు స్తున్నది. ఈ మేరకు షర్మిల భర్త అనిల్‌కుమార్‌తో ఇప్పటికే ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలు చర్చించినట్టు సమాచారం. ఫైనల్‌గా షర్మిలతో కూడా ఈ విషయం మరోసారి చర్చించాక ఏఐసీసీ అధికారికంగా ప్రక టిస్తుందని సమాచారం. కర్ణాటక, తెలంగాణలో సాధించిన విజయాల స్ఫూర్తితో ఏపీలోనూ పార్టీని బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ వ్యూహరచన చేస్తు న్నదని, ఇందులో భాగంగానే షర్మిలకు పార్టీ బాధ్యతలు అప్పగించేందుకు పార్టీ పెద్దలు పావులు కదుపుతున్నట్టు తెలుస్తున్నది. ఏపీ కాంగ్రెస్ కమిటీ పగ్గాలు చేపట్టడానికి షర్మిల ఇప్పడే అంగీకరించని పక్షంలో తొలుత పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా నియమించి, ఆ తర్వాత పార్టీ పగ్గాలు అప్పగించా లన్నది పార్టీ వ్యూహమని చెప్తున్నారు.



30కి చేరిన జపాన్ భూకంపం మృతుల సంఖ్య..
# ఇషికావా నగరంలోనే అత్యధికం

నూతన సంవత్సరం మొదటి రోజున వరుస భూకంపాలతో జపాన్ వణికి పోయింది. జపాన్ పశ్చిమ తీరంలోని ఇషికావా ప్రిఫెక్షర్ సమీప ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం 4 గంటల తర్వాత రిక్టర్ స్కేల్‌పై 4 కంటే ఎక్కువ తీవ్రతతో 155 సార్లు భూమి కంపిం చిందని జపాన్ వాతావరణ శాఖ తెలిపింది. ఇందులో సోమవారం నాటి 7.6 తీవ్రతతో వచ్చిన భూకంపంతోపాటు 6 తీవ్రత నమోదైన భూకంపాలు కూడా ఉన్నాయని వెల్లడించింది. మంగళవారం తెల్లవారుజామున కూడా ఆరుసార్లు శక్తి వంతమైన ప్రకంపనలు వచ్చాయని పేర్కొంది.ఇక భూకంపం ధాటికి వేల ఇళ్లు, భవనాలు నేలకూలాయి. మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. మరోవైపు.. మృతుల సంఖ్య కూడా పెరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ భూకంపం ఘటనలో ఇప్పటి వరకూ సుమారు 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు జపాన్ మీడియా వెల్ల డించింది అందులో ఇషికావా నగ రంలోనే అత్యధిక మంది మరణించినట్లు పేర్కొంది. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. మరోవైపు భారీ భూకంపం నేపథ్యంలో అధికారులు సునామీ హెచ్చ రికలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జపాన్‌లో సునామీ రావడంతో అలలు మీటరు ఎత్తు వరకు ఎగసిప డ్డాయని, దీంతో పలు ఇండ్లు ధ్వంసమ య్యాయని అధికారులు తెలిపారు. వాజిమా పట్టణంలో దాదాపు 30 భవనాలు కుప్పకూలాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో 43 వేలకు పైగా నివాసితులు అంధకారంలోనే ఉండి పోయారని అధికారులు చెప్పారు. ఇషికావా తీరంలో అలలు విరుచుకు పడ్డాయి. ఇక భూకంప తీవ్రత ఎక్కువగా ఉన్న సముద్ర తీర ప్రాంతం అయిన ఇషి కావాలో మరణాల సంఖ్య భారీగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, జపాన్ వాతావరణ సంస్థ సోమవారం జారీ చేసిన సునామీ హెచ్చరికల తీవ్రతను తగ్గించడం కాస్త ఊరట కల్పిస్తోంది. కానీ మరోసారి భూ ప్రకంపనలు, సునామీ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. సముద్ర తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని సూచించింది.




అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా
## అసదుద్దీన్ ఓవైసీ కీలక వ్యాఖ్యలు

అయోధ్య రామాలయ ప్రతిష్ఠాపనకు ముహూర్తం సమీపిస్తున్న వేళ అసదుద్దీన్ ఓవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని మూడు, నాలుగు మసీదులపై కుట్ర జరుగుతోందంటూ సంచలన కామెంట్స్ చేశారు. స్వదేశంలో నివాసం ఉంటూ మసీదులపై శ్రద్ధ వహించాలని ముస్లిం సామాజిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. బాబ్రీ మసీదు గురించి ప్రస్తావిస్తూ, గత 500 ఏళ్లుగా పవిత్ర ఖురాన్ పఠించిన స్థలం ఇప్పుడు తమ చేతుల్లో లేదని తెలిపారు. ముస్లిం యువకులు అప్రమత్తంగా ఉంటూ, ఐక్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. తమ సమీపంలోని మసీదుల్లో ఎప్పుడూ జనాలుండేలా చూసుకోవాలని హితవు పలికారు.

**అయోధ్య తీర్పు గురించి క్లుప్తంగా..**

అయోధ్య వివాదంపై 2019లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో రామ మందిర నిర్మాణానికి మార్గం సుగమం అయింది. అయోధ్యలో బ్రహ్మాండమైన రామ మందిర నిర్మాణానికి సంబంధించి అన్ని నిర్ణ యాలను తీసుకునేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ను సుప్రీం కోర్టు ఏర్పాటు చేసింది. ఈ ట్రస్ట్ కేంద్ర ప్రభుత్వంతో సంప్ర దింపులు జరిపి ఆలయ నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు చేయడంలో పధాన భూమిక పోషించింది. ఆ తరువాత 2020 ఆగస్టు 5న అయోధ్యలో రామ మందిరానికి శంకుస్థాపన చేశారు ప్రధాని నరేంద్ర మోడీ. ఇక రామమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమం 2024 జనవరి 16న ప్రారంభమై ఏడు రోజుల పాటు కన్నుల పండువగా జరగనుంది. చివరి రోజు జనవరి 22న ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించినంతరం 'మృగశిర నక్ష త్రం'లో రామ్‌లాలా విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.



దేశంలో 4,565కి పెరిగిన క్రియాశీల కేసులు..
## కొత్తగా 573 మందికి కొవిడ్ పాజిటివ్

భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. తాజాగా 500కు పైనే కొత్త కేసులు నమోదయ్యాయి. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్ల డించిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకూ 24 గంటల వ్యవధిలో 573 కరోనా కేసులు బయటపడ్డాయి.తాజా కేసులతో కలిపి దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 4,565కి పెరిగింది. ఇక నిన్న ఒక్క రోజే రెండు మరణాలు నమోదయ్యాయి. హర్యాణాలో ఒకరు, కర్ణాటకలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇప్పటి వరకూ కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 5,33,366కి పెరిగింది. కొవిడ్ నుంచి కోలుకున్న వారి సంఖ్య 4,44,76,550గా ఉంది. మరోవైపు దేశవ్యాప్తంగా కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 (JN.1) కేసులు కూడా భారీగా పెరుగుతున్నాయి.

## నేటి నుంచి మళ్లీ ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ..





తెలంగాణలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసే క్రమంలో ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరి స్తున్నారు. 'అభయహస్తం' గ్యారంటీ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం డిసెంబర్ 28వ తేదీ నుంచి అప్లికేషన్స్‌ను స్వీకరిస్తున్నారు. గ్రామ, వార్డుల్లో సభలు నిర్వహిస్తూ దరఖాస్తులను స్వీకరి స్తున్నారు. ఇదిలా ఉంటే డిసెంబర్ 31న ఆదివారం, జనవరి 1న దరఖాస్తుల స్వీకరణకు అధికారులు విరామం ఇవ్వగా నేటి నుంచి (మంగళవారం) నుంచి దరఖాస్తుల స్వీకరణ తిరిగి ప్రారంభం కానుంది. ప్రజాపాలనలో ఇప్పటివరకు 40.57 లక్షల దరఖాస్తులు స్వీకరించారు. పింఛన్లు, రైతు భరోసా పథకాలకు దరఖాస్తులపై ప్రభుత్వం సూచనలు జారీ చేసింది. ఇప్పటికే పింఛను, రైతుబంధు వస్తున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకో వద్దని సూచించింది. కొత్తగా అవసరమైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. ఇదిలా ఉంటే ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో దర ఖాస్తుల సంఖ్య కోటి దాటే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజాలపాలన దరఖాస్తుల్లో గ్యాస్ సిలిండర్, 2,500, గృహ జ్యోతి పథకంలోని 200 యూనిట్ల ఉచిత్ విద్యుత్, ఇళ్ల స్థలాల కోసం ఎక్కువగా అర్జీలు వస్తున్నాయి. దర ఖాస్తుల స్వీకరణకు ఇంకా 5 రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో భారీగా అప్లికేషన్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. మాసబ్ ట్యాంక్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నేడు జరిగే ప్రజా పాలన కార్యక్రమానికి మంత్రి పొన్నం హాజరుకానున్నారు. ఇక ప్రజాభవన్ లో ప్రజావాణి కార్యక్రమం ఈ రోజు జరగనుంది. ఇదిల ఉంటే కొన్ని చోట్ల ప్రజాపాలన దరఖాస్తులు అమ్ముతున్నట్లు వచ్చాయి. దీంతో ఈ అంశంపై సీఎం రేవంత్ స్పందించారు. దరఖాస్తులు అమ్మితే ఊరుకోబోమని హెచ్చరించారు. రైతుబంధు, పింఛన్లపై అపోహలకు గురికావద్దని, పాత లబ్ధిదా రులందరికీ యథావిధిగా ఈ పథకాలు అందు తాయని రేవంత్ స్పష్టం చేశారు. గతంలో లబ్ధి పొందనివారు, కొత్తగా లబ్ధిపొందాలనుకునేవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



హిమాచల్ ప్రదేశ్ డీజీపీ తొలగింపు..
## సుప్రీంలో రేపు విచారణ

హిమాచల్ ప్రదేశ్ డీజీపీ సంజయ్ కుండును ఆ పదవి నుంచి తొలగించారు. ఆయన్ను ఆయుష్ శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అయితే తనను బదిలీ చేయాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ సంజయ్ కుండు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం రేపు ఆ కేసులో విచారణ చేపట్టనున్నది. కుండు తరపున సీనియర్ న్యాయవాది ముఖుల్ రోహత్గీ వాదించనున్నారు. సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించనున్నది. డీజీపీ కుండు వాదనలను హైకోర్టు పట్టించుకోలేదని, ఆ కోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం పాటించిందని రోహత్గీ అన్నారు. పాలంపుర్ వ్యాపారవేత్త నిషాంత్ శర్మ వేధింపుల కేసులో విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున కుండును డీజీపీ హోదా నుంచి తప్పిస్తున్నట్లు హిమాచల్ హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది.జనవరి 4వ తేదీ లోగా డీజీపీ కుండు, కంగ్రా ఎస్పీ షాలిని అగ్నిహోత్రిని ఇతర పోస్టులకు బదిలీ చేయాలని కోర్టు తన తీర్పులో ఆదేశించింది.



న్యూ ఇయర్ వేళ
## OYO రూమ్ బుకింగ్స్ రికార్డు స్థాయిలో

కొత్తేడాదికి ప్రజలంతా గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పారు. అయితే, నూతన సంవత్సర వేడుకల సమయంలో ప్రతి గంటకు 1,722 యూనిట్ల కండోమ్స్ ఆర్డర్లు వచ్చాయని స్విగ్గీ ఇన్‌స్టామర్ట్ తెలిపింది. మరోవైపు OYO రూమ్ బుకింగ్స్ రికార్డు స్థాయిలో ఒక్క రోజులో 6.2 లక్షలు జరిగాయి. గతంతో పోలిస్తే 37 శాతం బుకింగ్స్ అధికంగా జరిగాయి. గోవాలో 50 శాతం, నైనిటాల్‌లో 60 శాతం అధికంగా రూమ్స్ బుక్ అయ్యాయి.

## మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన హింస
### ఐదు జిల్లాల్లో కర్ఫ్యూ

మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. తౌబల్ జిల్లా లిలాంగ్ చింగ్‌జావో ప్రాంతంలో సోమవారం సాయంత్రం పోలీసు దుస్తుల్లో వచ్చిన దుండగులు జరిపిన కాల్పుల్లో నలుగురు చనిపోగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దాంతో తౌబల్‌తోపాటు ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, కాక్చింగ్, బిష్ణుపూర్ జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. దాంతో ఆగ్రహించిన ఒక వర్గం వారు నాలుగు కార్లకు నిప్పుపెట్టారు. కార్లు ఎవరివనే విషయం తెలియాల్సి ఉంది. కాల్పుల ఘటనను సీఎం బీరేన్ సింగ్ తీవ్రంగా ఖండించారు. ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదన్నారు. పోలీసులు దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు. దోషులను పట్టుకుని, చట్టం ముందు నిలబెడతామని ఆయన స్పష్టం చేశారు.





భారీగా పెరిగిన బియ్యం ధరలు..
## క్వింటాలు రూ.6,200

నిన్నమొన్నటి వరకు వంటనూనెలు, కూరగాయల ధరలు సామాన్యులను భయపెడితే ఇప్పడా జాబితాలోకి బియ్యం వచ్చి చేరాయి. గతంలో ఎన్నడూ లేనంతగా బియ్యం ధరలు పెరుగుతుండడం కలవరపెడుతున్నది. నిన్నమొన్నటి వరకు కిలో బియ్యం రూ. 45 నుంచి రూ.50 మధ్య లభించగా ఇప్పడా ధర ఏకంగా రూ. 60కి పెరిగింది. కొంచెం మంచి రకాలైతే రూ. 70 వరకు చెల్లించుకోవాల్సి వస్తున్నది. ప్రజలు ఎక్కువగా వినియోగించే సన్న రకాలైన బీపీటీ, హెచ్ఎంటీ, సోనా మసూరి ధరలు సగటున క్వింటాలుకు రూ.1000 నుంచి రూ. 1500 వరకు పెరిగాయి. నిరుడు క్వింటాలు రూ. 4,500 నుంచి రూ. 5 వేల మధ్య లభించగా ఇప్పడు ఏకంగా రూ. 6,200 వరకు పెరిగింది. ఇందులో పాతబియ్యం అయితే రూ.7,500 వరకు పలుకుతున్నది. హెచ్ఎంటీ, బీపీటీ కొత్త రకం బియ్యం ధర గతంలో క్వింటాలుకు రూ. 3,300 నుంచి రూ. 3,500 వరకు ఉండగా ఇప్పడది రూ. 4,500కు చేరింది. మొత్తంగా బియ్యం ధరలు సగటున రూ. 1000 పెరిగాయి.



## పేరెంట్స్‌పై అలిగి యువతి ఆత్మహత్య

బెంగళూరు సుధామనగర్‌లో సోమవారం షాకింగ్ ఘటన జరిగింది. వర్షిణి (21) అనే యువతి సుధామ నగర్‌లో తల్లిదండ్రులతో ఉంటోంది. బీబీఏ చదువుతున్న ఆమె ఫొటోగ్రఫీ కోర్సు కూడా చేస్తోంది. నూతన సంవత్సరం రోజున ఫొటోషూట్ కోసం ఆమె వెళ్లాల్సి ఉంది. అయితే తల్లిదండ్రులు వద్దనడంతో రూమ్ లోపలికి వెళ్లి డోర్ వేసుకుంది. కాసేపటికే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచింది.




ఎయిర్ పోర్ట్‌లో
## పార్కింగ్ నుంచే చెక్ ఇన్

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ ద్వారా రాకపోకలు సాగించే ప్రయాణికులకు విమానాశ్రయ అధికారులు కొత్త సంవత్సరం సందర్భంగా సిటీసైడ్ సెల్ఫ్ చెక్-ఇన్ విధానాన్ని సోమవారం అందుబాటులోకి తీసు కొచ్చారు. ఎయిర్ పోర్ట్ లోని కారు పార్కింగ్ ప్రాంతం నుంచే ప్రయాణికులు బోర్డింగ్, సామగ్రి పాస్‌లను పొందవచ్చు. కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టామని క్రియేటివ్ డిపార్ట్ మెంట్ ప్రధాన అధికారి ఎస్‌జీకే కిషోర్ తెలిపారు.



భారతీయ యువతకు

# ఇది మంచి సమయం ప్రధాని మోదీ

భారతీయ యువత తమ నైపుణ్యాలతో కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. చంద్రయాన్ వంటి ప్రయోగాలతో మన శాస్త్రవేత్తలు భారత్ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రశంసించారు. తమిళనాడులోని తిరుచ్చిరాపల్లిలో ఉన్న భారతీదాసన్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో మోదీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "యువత ధైర్యవంతమైన సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాలనే నినాదంతో భారతీదాసన్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ప్రస్తుతం దేశ యువత అదే పనిలో నిమగ్నమై ఉంది. యువత అంటేనే శక్తికి నిదర్శనం. నైపుణ్యంతో వేగంగా పని చేయడం వారికున్న సామర్థ్యం. దేశాభివృద్ధిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు యువతకు ఇది మంచి సమయం. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా.. నైపుణ్యాలను పెంచుకుంటూ.. కొత్త విషయాలను నేర్చుకుంటూ ముందుకు సాగాలి" అని యువతకు మోదీ సూచించారు. 2014లో భారత్ నాలుగు వేల ఆవిష్కరణలకు పేటెంట్లు పొందితే.. ప్రస్తుతం ఆ సంఖ్య 50 వేలకు చేరిందని ప్రధాని తెలిపారు. చంద్రయాన్ వంటి ప్రయోగాలతో భారత శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని, మునుపెన్నడూ లేని విధంగా శాస్త్రవేత్తలు భారత ప్రతిభను ప్రపంచానికి చాటి చెబుతున్నారని ప్రశంసించారు. భారతీయ కళాకారులు, సంగీతకారులు ఎన్నో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారని తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ తిరుచ్చిరాపల్లిలో రూ.20,140 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను శంకుస్థాపన చేశారు. గత పదేళ్లలో విమానాశ్రయాలు, జాతీయ రహదారుల సంఖ్యను రెండింతలు చేసినట్లు మోదీ తెలిపారు.



ఆ క్యాప్ నాకెంతో సెంటిమెంట్..

# దయచేసి ఇచ్చేయండి

జనవరి 3వ తేదీ నుంచి సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియా, పాకిస్థాన్ మధ్య చివరి టెస్టు ప్రారంభంకానుంది. ఈ మ్యాచ్‌తో ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ డేవిడ్ వార్నర్ టెస్టు కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నాడు. ఈ మ్యాచ్ ముంగిట వార్నర్‌కు షాక్ తగిలింది. అతడి బ్యాగీ గ్రీన్ క్యాప్ (టెస్టుల్లో ధరించే క్యాప్)ని పొగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని అతడే స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించాడు. "మెల్‌బోర్న్ నుంచి సిడ్నీ వచ్చే క్రమంలో లగేజ్ నుంచి నా బ్యాక్‌ప్యాక్‌ను (బ్యాగ్)ని ఎవరో తీసుకున్నారు. అందులో నా పిల్లల వస్తువులు ఉన్నాయి. నా బ్యాగీ గ్రీన్ క్యాప్ కూడా ఉంది. అది నాకెంతో సెంటిమెంట్. దానిని ధరించి నా చివరి మ్యాచ్ ఆడాలనుకుంటున్నా. కావాలని ఎవరైనా బ్యాక్‌ప్యాక్‌ను తీసుకుంటే వారికి మరో బ్యాక్‌ప్యాక్ ఇస్తాను. మిమ్మల్ని ఎలాంటి ఇబ్బందికి గురిచేయను. ఎయిర్‌పోర్ట్, హోటల్ సిబ్బందిని కూడా అడిగాను. సీసీటీవీ ఫుటేజీలు కూడా పరిశీలించాం. ఎక్కడ దాని జాడ దొరకలేదు. దయచేసి నా బ్యాగీ గ్రీన్ క్యాప్‌ని తిరిగి ఇస్తే ఎంతో ఆనందిస్తా" అని వార్నర్ విజ్ఞప్తి చేశాడు. తన సొంత మైదానం సిడ్నీలో బుధవారం పాకిస్థాన్‌తో ఆరంభమయ్యే మూడో టెస్టుతో సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలగుతున్నట్లు గతంలోనే వెల్లడించిన వార్నర్.. వన్డేలకూ గుడ్ బై చెబుతున్నట్లు సోమవారం ప్రకటించాడు. భారత్‌లో ఆడిన వన్డే ప్రపంచకప్ ఫైనలే తనకు 50 ఓవర్ల ఫార్మాట్లో చివరి మ్యాచ్ అని పేర్కొన్నాడు. కానీ, జట్టుకు అవసరమైతే 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులో ఉంటానని పేర్కొన్నాడు.

**నేను ఎదుర్కొన్న అత్యంత కఠినమైన బౌలర్ అతడే**

చివరి టెస్టు ఆడనున్న వార్నర్ తన కెరీర్‌లో ఎదుర్కొన్న కఠినమైన బౌలర్ ఎవరో వెల్లడించాడు. సౌతాఫ్రికా పేస్ దిగ్గజం డేల్ స్టెయిన్‌ను ఎదుర్కోవడంలో చాలా ఇబ్బందులు పడినట్లు పేర్కొన్నాడు. "నా టెస్టు కెరీర్‌లో ఎదుర్కొన్న అత్యంత కఠినమైన బౌలర్ డేల్ స్టెయిన్. 2016-17లో గబ్బా వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన తొలి టెస్టు మ్యాచ్ నాకింకా గుర్తుంది. ఈ మ్యాచ్ మొదటి సెషన్‌లో స్టెయిన్ నిప్పులు చెరిగాడు. బౌన్సర్లు వేసి నాతోపాటు షాన్ మార్ష్‌ను కూడా భయపెట్టాడు. సెషన్‌లో 45 నిమిషాలపాటు మాకు చుక్కలు చూపించాడు. మార్ష్ నా దగ్గరకు వచ్చి "స్టెయిన్ బౌలింగ్‌లో ఆడలేకపోతున్నా. అతడిని మనం ఎలా ఎదుర్కోవాలో నాకైతే తెలీదు" అని చెప్పాడు. స్టెయిన్ నా బ్యాక్‌సైడ్ ఎక్కువగా బంతులు వేశాడు. ఓ బంతి భుజానికి కూడా తగిలింది" అని వార్నర్ వివరించాడు.



# ఇబ్బందుల్లోనే చైనా ఆర్థిక వ్యవస్థ

## జిన్‌పింగ్ నోట అనూహ్య మాట

ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా పేరొందిన చైనా గత కొంతకాలంగా డీలా పడింది. కొవిడ్ అధ్యాయం ముగిసిన తర్వాత నుంచి తమ ఆర్థిక వ్యవస్థ సవాళ్లను ఎదుర్కొంటోందని ఆ దేశ అగ్ర నాయకులు ఇప్పటికే వెల్లడించారు. కానీ, దేశాధినేత షీ జిన్‌పింగ్ మాత్రం ఇప్పటి వరకు దీనిపై మౌనంగా ఉన్నారు. తాజాగా ఈ అంశంపై స్పందించిన జిన్‌పింగ్.. ఆర్థిక సవాళ్ల మాట నిజమేనంటూ అంగీకరించడం గమనార్హం. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలనుద్దేశించి జిన్‌పింగ్ ప్రసంగించారు. ఇందులో ఆయన చైనా ఆర్థిక పరిస్థితులను నేరుగా ప్రస్తావించారు. దేశంలోని వాణిజ్య, వ్యాపారాలు కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నాయని, నిరుద్యోగులు ఉపాధి వేటలో ఇబ్బందులు పడుతున్నారని అంగీకరించారు. 2013 నుంచి ప్రతి ఏటా జిన్‌పింగ్ నూతన సంవత్సర ప్రసంగం చేస్తున్నారు. అయితే, అందులో ఆయన ఆర్థిక సవాళ్ల గురించి ప్రస్తావించడం ఇదే తొలిసారి. "కొన్ని సంస్థలు కష్ట కాలాన్ని చవిచూస్తున్నాయి. ఉద్యోగాలు లేక, కనీస అవసరాలు తీరక కొంతమంది బాధపడుతున్నారు. ఈ ఇబ్బందుల గురించి నేను కూడా ఆలోచిస్తున్నా. ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలోకి తెచ్చేలా వేగవంతమైన చర్యలు తీసుకుంటాం" అని జిన్‌పింగ్ తన ప్రసంగంలో పేర్కొన్నట్లు పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించారు. చైనా అధికారిక మీడియాలో ప్రసారమైన ఈ ప్రసంగం వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.



# 'నిజం గెలవాలి'.. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనకు నారా భువనేశ్వరి

టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పర్యటనలు మళ్లీ ప్రారంభించనున్నారు. చంద్రబాబు అరెస్ట్‌తో మనస్తాపానికి గురై చనిపోయిన వారి కుటుంబాలను ఆమె పరామర్శించనున్నారు. వారానికి మూడు రోజుల పాటు ఆమె పర్యటిస్తారు. ఈనెల 3 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనున్నారు. 3న విజయనగరం, 4న శ్రీకాకుళం, 5న విశాఖపట్నం జిల్లాలకు భువనేశ్వరి వెళ్లనున్నారు. ఇప్పటికే పలు కుటుంబాలను ఆమె పరామర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ 'నిజం గెలవాలి' పేరిట పర్యటనలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.



# మాటలు కాదు.. చేతల్లో చూపించాలనే నిబద్ధతతో పనిచేస్తున్నాం

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గత ప్రభుత్వం పేదల సమస్యలను విస్మరించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. రోజుకు 16 గంటలపాటు చిత్తశుద్ధితో తాము పని చేస్తున్నామని చెప్పారు. ఖమ్మం గ్రామీణ మండలం మంగళగూడెంలో నిర్వహించిన 'ప్రజాపాలన' సభలో పొంగులేటి మాట్లాడారు. 'గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం ఆర్థికంగా ఎంతో నష్టపోయింది. రూ.6.71 లక్షల కోట్లు అప్పు చేసింది. గత సీఎం ఎన్నో అప్పులు చేసి ప్రజాధనంతో గొప్ప భవనం కట్టుకున్నారు. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను తొలి మంత్రివర్గ సమావేశంలో ఆమోదించాం. దీంతోనే మా ప్రభుత్వ చిత్తశుద్ధి కనిపిస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచాం. మాటలు కాదు.. చేతల్లో చూపించాలనే నిబద్ధతతో పనిచేస్తున్నాం" అని పొంగులేటి అన్నారు.

# ప్రజావాణికి భారీగా తరలొచ్చిన బాధితులు

హైదరాబాద్ బేగంపేట్ లోని పూలే ప్రజాభవన్ లో ప్రజావాణి మొదలైంది. సిటీతో పాటు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో బాధితులు ప్రజావాణికి తరలివచ్చారు. ఇందులో ఎక్కువగా భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారే ఉన్నారు. తెల్లవారుజాము నుంచే పబ్లిక్ ప్రజా భవన్ దగ్గరకు చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగనుంది. హైదరాబాద్ తో పాటు జిల్లాల నుంచి తమ సమస్యలు ప్రభుత్వానికి చెప్పకునేందుకు జనం వచ్చారు. ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తమ భూమిని కబ్జా చేశారని ఆరోపిస్తూ.. బాధితులు,ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకొని ప్రజవాణికి వచ్చారు.

గత వారం అక్కడే ఉన్నాను.. జపాన్ భూకంపంపై

# ఎన్టీఆర్ దిగ్భ్రాంతి

జపాన్‌లో సంభవించిన వరుస భూకంపాల ఘటనపై నటుడు ఎన్టీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత వారం తారక్ వ్యక్తిగత పర్యటన నిమిత్తం జపాన్‌లోనే ఉన్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్ వచ్చారు. "గత వారతమంతా అక్కడే ఉన్నాను. ఆ ప్రాంతంలోనే భూకంపం రావడం నా హృదయాన్ని కలచివేసింది. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు త్వరగా కోలుకోవాలి" అని ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. జపాన్‌లో సోమవారం దాదాపు 21 సార్లు భూమి కంపించడంతో పశ్చిమ ప్రాంతం అల్లకల్లోలమైంది. ఈ ఘటనలో 20 మందికిపైగా మృతి చెందినట్లు.. పలువురు గాయపడినట్లు అధికారులు చెబుతున్నారు. వరుసగా సంభవించిన ఈ భూకంపాలతో తొలుత భారీ సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. సముద్ర తీర ప్రాంతంలోని ప్రజలంతా ఖాళీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆ తరువాత సునామీ హెచ్చరికల తీవ్రతను తగ్గించింది.





# దక్షిణ కొరియాలో ఘోరం.. ప్రతిపక్ష నేతపై కత్తి దాడి!

దక్షిణ కొరియా ప్రతిపక్ష నేత లీ జే మ్యూంగ్‌పై గుర్తు తెలియని దుండగుడు దాడి చేశాడు. బుసన్ అనే నగరంలో పర్యటిస్తున్న సమయంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. నిర్మాణంలో ఉన్న ఎయిర్‌పోర్ట్ పనులను పరిశీలిస్తుండగా.. దుండగుడు ఒక్కసారిగా ఆయనపై దాడికి పాల్పడ్డట్లు అధికారులు తెలిపారు. డెమొక్రాటిక్ పార్టీ నేత అయిన మ్యూంగ్.. దాడి తర్వాత స్పృహలోనే ఉన్నారని ఎమర్జెన్సీ ఆఫీస్ అధికారులు తెలిపారు. కానీ, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఏంటనేది మాత్రం కచ్చితంగా చెప్పలేమని పేర్కొన్నారు. ఒక కత్తితో దుండగుడు మ్యూంగ్ మెడపై పొడిచినట్లు దక్షిణ కొరియా మీడియా వర్గాలు వెల్లడించాయి. 2022 ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ చేతిలో లీ జే మ్యూంగ్ ఓడిపోయారు. దాడికి పాల్పడిన దుండగుణ్ని పోలీసులు అక్కడే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతడు కిరీటం తరహాలో ఉన్న ఓ వస్తువును తలపై ధరించినట్లు మీడియా వర్గాలు వెల్లడించాయి. లీ జే మ్యూంగ్ ఏ విషయంపైనైనా బాహాటంగానే తన అభిప్రాయం వ్యక్తం చేస్తారని ఆయనకు పేరుంది.



# హాట్ లుక్స్‌లో అరియనా

[redacted] తున్నాయి. ఆమె బాడీ పై నెటిజన్లు పలు రకాల కామెంట్స్ చేస్తున్నారు.. అయినా తగ్గేదేలే అంటుంది ఈ హాట్ గర్ల్.. ఇదిలా ఉండగా తాజాగా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ను బాగానే ఎంజాయ్ చేసింది. నాలుగైదు రోజులుగా వేడుకల్లో ఈ ముద్దుగుమ్మ సందడి సందడి చేస్తోంది. అందుకు సంబంధించిన ఫొటోలనూ పంచుకుంటోంది. తాజాగా మాత్రం బ్రాలో కనిపించి,చలిలో చెమటలు పట్టించింది.. ఆ హాట్ పోజులను తన సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది అవి క్షణాల్లో వైరల్ అవుతున్నాయి.